క్లుప్తంగా

రహదారికి మరమ్మతులు చేయించాలి



జి.కొండూరు: ఇటీవల బుడమేరుకు వచ్చిన వరద ప్రవాహంతో కవులూరు, వెలగలేరు గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి అర కిలోమీటరు మేర పూర్తిగా ధ్వంసమైంది. ఇరు గ్రామాల వ్యవసాయ భూములు కలిసి ఉండడంతో రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. ప్రజలు ఈ రెండు గ్రామాలకు రాకపోకలు సాగించాలన్నా ఇదే ప్రధాన రహదారిగా ఉంది. రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో 10 కిలోమీటర్ల మేర అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి గండ్లను పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మైలవరం సీఐ చంద్రశేఖర్

మైలవరం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ అన్నారు. మైలవరం సీఐ కార్యాలయ ప్రాంగణం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళలు, మహిళా పోలీసులకు సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు శనివారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్ ఫోన్లలో సైబర్ సిటిజన్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. సైబర్ సిటిజన్ యాప్‌లో వచ్చే వీడియోలు చూసి సైబర్ నేరాల బారిన పడకుండా తమను తాము కాపాడుకోవాలని చెప్పారు. యాప్ డౌన్‌లోడ్ చేశాక రిఫరెన్స్ ఐడీ స్థానంలో సీడబ్ల్యూ-4566 టైప్ చేయాలన్నారు. మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల మహిళా పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు అన్నదానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సీఐటీయూ ఆధ్వర్యంలో 250 మందికి అన్నదానం చేశారు. సీఐటీయూ నాయకులు మహేష్, వాసుదేవ్, కొండలరావు, ఐద్వా నాయకులు పార్వతి, బేబీ సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

జి.కొండూరు: జి.కొండూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ అనూరాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఎ.కొండూరు: దోమల నివారణకు గొల్లమందల గ్రామంలో మలాథియాన్ ఫాగింగ్ చేయించామని పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వాతి, దివ్య శనివారం తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి బాబువలి, సూపర్‌వైజర్ బాలమురళీకృష్ణ, సర్పంచ్ దాడి రామారావు, ఏఎన్ఎం మునికుమారి, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబజారులో స్వచ్ఛతా హీ సేవా

మైలవరం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని రైతుబజారు ఈఓ పి. చిట్టిబాబు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు శనివారం మైలవరం రైతుబజారులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి. శివహరి ప్రసాద్, ఏరో స్పేస్ విభాగపు ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి అశుతోష్ శుక్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ

తిరువూరు: స్థానిక అశోక్ నగర్‌లో శనివారం మృతిచెందిన వృద్ధురాలి నేత్రాలను లయన్స్ క్లబ్‌కు దానం చేశారు. రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి పాటిబండ్ల సీతాపతి భార్య ఝాన్సీలక్ష్మి (78) మృతి చెందింది. కుటుంబ సభ్యుల అనుమతితో లయన్స్ క్లబ్ వారు విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి సమాచారం ఇచ్చారు. వైద్యులు వచ్చి ఆమె కార్నియాలను సేకరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, సభ్యులు సంకురాత్రి జనార్ధనరావు, అడుసుమల్లి సుబ్రహ్మణ్యం, కొమ్మినేని రాజేష్‌ఖన్నా, నూతక్కి రాఘవరావు పాల్గొన్నారు.

చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించు స్వామీ

- తిరుమల పవిత్రత కాపాడాలి
- శ్రీవారి ప్రసాదం ప్రతిష్ట దెబ్బతీసేలా చంద్రబాబు ఆరోపణలు
- మంచి ప్రభుత్వం కాదు ముంచిన ప్రభుత్వం
- చంద్రబాబు పాపాల ప్రక్షాళనకు వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



నూజివీడు వేంకటాచల స్వామికి పూజలు చేస్తున్న మేకా ప్రతాప్ అప్పారావు



రామచంద్రాపురంలో పూజల్లో పాల్గొన్న స్వామిదాసు, నాయకులు

తిరువూరు/మైలవరం/నూజివీడు: ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేసి తిరుమల పవిత్రతను వెంకటేశ్వరస్వామి కాపాడాలని కోరుకుంటూ తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తిరుమల వేంకటేశ్వరస్వామి భక్తులు లడ్డూ ప్రసాదాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారని, అలాంటి ప్రసాదంపై రాజకీయం చేస్తూ తిరుమల పవిత్రతను చంద్రబాబు మంటగలిపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వందరోజుల కూటమి పాలనలో రాష్ట్ర ప్రజలను నిండా ముంచారని, ఇది మంచి ప్రభుత్వం కాదని, ముంచిన ప్రభుత్వమని విమర్శించారు. చంద్రబాబు పాపాలు ప్రక్షాళన చేసి ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకున్నారు. తిరువూరు వేంకటాచలస్వామి ఆలయంలో శనివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నాయకులు పాప ప్రక్షాళన పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు మాట్లాడుతూ తిరుమల పవిత్రతకు భంగం కలిగించిన చంద్రబాబును ఆ దేవుడు వదిలిపెట్టడని, తగిన మూల్యం చెల్లించుకో తప్పదని హెచ్చరించారు. రాజకీయ దుర్బుద్ధితోనే చంద్రబాబు ఈ విధమైన అబద్ధాలకు తెరతీశారని, ప్రజలు వాస్తవాలు గ్రహించారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజలను తప్పు దోవ పట్టించే విధంగా అసత్యాలు ప్రచారం చేయడాన్ని తప్పుపట్టారు. ఇకనైనా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలుకు సీఎం చంద్రబాబు కృషి చేయాలని హితవు పలికారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యానారాయణ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, నాయకులు రేగళ్ల మోహన్‌రెడ్డి, గజ్జల సీతారామారావు, నరెడ్ల వీరారెడ్డి, కాలసాని గోపాల నాగేశ్వరరావు, విజయలక్ష్మి, భూక్యా గన్యా, సీతారావమ్మ, అంజన్‌రెడ్డి, బాల కృష్ణ, వేణుబాబు, షేక్ జాకీర్, యరదేశి రామారావు, నగర పంచాయతీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

✦ పైడూరుపాడు(విజయవాడరూరల్): పైడూరుపాడు వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం చంద్రబాబుకు, కూటమి నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని వారు కోరుకున్నారు. గ్రామ అధ్యక్షుడు వి.సీతారామయ్య, డాక్టర్ బి.రవికిషోర్, నాయకులు డొక్కా వెంకటరత్నం, ఎస్సీ సెల్ నాయకులు కొమ్మకూరి ప్రసాద్, గ్రామ కన్వీనర్ కొసనం సుబ్బారావు, స్టాలిన్ పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు అసత్య ప్రచారం

జి.కొండూరు: తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు అసత్య ప్రచారంతో దేవస్థాన ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆయనకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ మైలవరం నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జి.కొండూరు చెన్నకేశవస్వామి దేవాలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. వెల్లటూరులో కేడీసీసీ మాజీ డైరెక్టర్ రవీంద్రరాణా ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎ. కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మేడపాటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో పూజలు జరిపారు. విజయవాడ రూరల్ పరిధి కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జి.కొండూరు చెన్నకేశస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, నాయకులు

చంద్రబాబుది క్షమించరాని నేరం

నూజివీడు: తిరుపతి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు దుష్ప్రచారం చేయడం క్షమించరాని నేరమని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు పాపాల ప్రక్షాళన కోసం వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు మేకా ప్రతాప్ అప్పారావు శనివారం పట్టణంలోని వేంకటాచలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి లడ్డూలో కొవ్వు కలిసిందని చెప్పడం దురదృష్టకరమన్నారు. నిజంగా ఏదైనా జరిగితే విచారణ చేసి చెప్పాలే గాని, సీఎం అలా చెప్పడం తప్పన్నారు. తిరుపతిలోని వేంకటేశ్వరస్వామిని ఎన్నో మతాల వారు దర్శించుకుంటారని, ఏనాడు స్వామి వారిని దర్శించుకోవద్దని టీటీడీ అధికారులు ఎవరితోనూ పేర్కొనలేదని చెప్పారు. చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్నప్పుడు 14 సార్లు, వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు 18 సార్లు ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో నెయ్యి ట్యాంకర్లను వెనక్కు పంపారన్నారు. అదే మాదిరిగా ఇప్పుడు కూడా ప్రమాణాలకు అనుగుణంగా లేని నెయ్యిని వెనక్కు పంపామని, లడ్డూ తయారీకి ఉపయోగించలేదని ఈఓ స్పష్టంగా చెప్పారన్నారు. అయినప్పటికీ చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తూ వేంకటేశ్వరస్వామి ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. తప్పు చేసిన వారిని ఆ దేవదేవుడే తప్పకుండా శిక్షిస్తాడని హెచ్చరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, ముసునూరు ఎంపీపీ కొండా దుర్గాభవానీ, చాట్రాయి వైస్ ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి, నూజివీడు పట్టణ, చాట్రాయి మండల అధ్యక్షులు శీలం రాము, మిద్దే బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

✦ నూజివీడు: మండలం పరిధి గొల్లపల్లిలోని పురాతన, ప్రసిద్ధి చెందిన రఘునాథస్వామి ఆలయంలో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు యామర్తి ఇశ్రాయేలు, ఉప సర్పంచి రెడ్డి మధుబాబు, నాయకులు చల్లారి రాఘవ, మేరుగ లెనిన్, బెజవాడ కోటేశ్వరరావు, రేపూరి మహేష్, పామర్తి రాంబాబు, చల్లారి రాము తదితరులు పాల్గొన్నారు.

✦ చాట్రాయి: చాట్రాయి, బూరుగుగూడెం గ్రామాల్లోని ఆలయాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పూజలు చేశారు. బూరుగుగూడెంలో గడ్డం లోకేశ్వరెడ్డి, తోట ప్రసాద్, రంగారావు, గడ్డం నరసింహారెడ్డి, చాట్రాయిలో బండి శ్రీనివాసరెడ్డి, కుప్పిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సంకు సత్యనారాయణ, దారా రాజు, కుప్పిరెడ్డి వసంతరెడ్డి, గడ్డం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

✦ గణపవరం(మైలవరం): మైలవరం మండలం గణపవరం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో జగనన్న యూత్ ఆధ్వర్యంలో మహిళలు శనివారం పూజలు నిర్వహించారు. సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని వారు కోరుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

✦ ముసునూరు: వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు ఆధ్వర్యంలో యూత్ సభ్యులు స్థానిక నరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల్పుల సాంబశివరావు, నగుళ్ల రాంబాబు, గండిపూడి రామారావు, మద్దాల బాబూరావు పాల్గొన్నారు.



బూరుగుగూడెంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గొల్లపల్లిలోని శ్రీరఘునాథస్వామి ఆలయం వద్ద పూజలు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



ముసునూరులో పూజలు చేస్తున్న నాయకులు



గణపవరంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



కొత్తూరు వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఈదులగూడెంలో పూజలు చేస్తున్న నాయకులు

మతం పేరుతో డైవర్షన్ రాజకీయాలు తగదు

రామచంద్రాపురం(విస్సన్నపేట): కలగర రామచంద్రాపురం గ్రామంలోని పద్మావతి, గోదావేవి సమేత వెంటేశ్వరస్వామి దేవస్థానంలో విస్సన్నపేట మండల వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తిచేసుకున్నా సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని, ప్రజలు ప్రశ్నిస్తారన్న ఉద్దేశంతోనే సీఎం చంద్రబాబు మతాన్ని అడ్డంపెట్టుకుని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ దేశిరెడ్డి రమ, గ్రామ ప్రముఖుడు దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, భూక్యా రాణి, దోర్నాల దామోదరరెడ్డి, సర్పంచ్‌లు కారుమంచి స్వాతి, బాలకొండయ్య, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఆవేదన, నివేదనల కలపోత కవి జాషువా



తిరువూరు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మైలవరం: ఆవేదన, నివేదనల కలపోత కవి గుర్రం జాషువా అని వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అధ్వర్యంలో కవి గుర్రం జాషువా జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రంగారావు మాట్లాడుతూ సంప్రదాయ ఛందస్సులో ప్రగతిశీల భావాలు చెప్పిన మొదటి కవి జాషువా అని ప్రశంసించారు. కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ మెండా దేవానంద్‌కుమార్ మాట్లాడుతూ కావ్యానికి ప్రాణవాయువుగా సమకాలీన సాంఘిక దురాచారాల దుస్థితిని జాషువా తన కవితల్లో కళ్లకు కట్టినట్లు వివరించారన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువూరు: ప్రసిద్ధ కవి గుర్రం జాషువా, సర్దార్ భగత్‌సింగ్ జయంతి కార్యక్రమం స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీ రంగంలో జాషువా ప్రత్యేకతను వక్తలు వివరించారు. భగత్‌సింగ్ పోరాట పటిమను కొనియాడారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కడిమి పాపారావు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు హరికృష్ణ, సుధాకర్, ప్రజా సంఘాల నాయకులు పంతంగి శ్రీనివాసరావు, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకటరత్నం, రవి, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ

నూజివీడు: మహిళలందరికి పౌష్టికాహారం అందాలని, ప్రతి కుటుంబం ఆదాయం పొందాలనే లక్ష్యంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటి కోళ్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ డీటీ సుందరరావు అన్నారు. మండలానికి మంజూరైన 78 యూనిట్ల కోళ్లను శనివారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద అందజేశారు. నూజివీడు మండల సమైక్య అధ్యక్షురాలు కె.నవత, ఏపీఎం దయాల రాజశేఖర్, సీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

■ ఆగిరిపల్లి: పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు అదనపు ఆదాయం పొంది ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్ సలాం అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. వెలుగు కార్యాలయం ఏపీఎం బోలగాని రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో 130 యూనిట్ల పంపిణీ చేశామని చెప్పారు. సర్పంచ్ చౌటపల్లి లక్ష్మి, మండల వ్యవసాయ అధికారి పల్లగాని చెన్నారావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో యోగా పోటీలు



విద్యార్థుల యోగాసనాలు

నూజివీడు: పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో 68వ ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాల బాలికల యోగా పోటీలు శనివారం నిర్వహించారు. పోటీలకు పి.శివ భాస్కరరావు అబ్జర్వర్‌గా వ్యవహరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ రవికాంత ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఎంపికైన విద్యార్థులను నూజివీడు ట్రిపుల్ ఐటీ ఏఓ డా.లక్ష్మణరావు, పీయూసీ ఇన్‌చార్జి దుర్గాబాబు అభినందించారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎంపికవ్వాలని, వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ అన్నారు. ట్రిపుల్ ఐటీ యోగా ట్రైనర్ అక్కినేని సత్య శ్రీధర్ పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులు

బాలికల వ్యక్తిగత విభాగంలో జి. స్వర్ణలత, పి. హారిక, ఏఎల్ ప్రవీణ, పి. దీపిక, జి. స్రవంతి ఎంపిక కాగా స్టాండ్‌బైలో ఎం.వీర ఐశ్వర్య, పి. శ్వేత ఎంపికయ్యారు. రిథమిక్ విభాగంలో జి. స్వర్ణలత, ఆర్టిస్టిక్ విభాగంలో కె. హరిత ఎంపికకాగా, బాలుర వ్యక్తిగత విభాగంలో సీహెచ్ దీపక్ నాయుడు, పి. షణ్ముఖ వికాస్, బీఆర్‌డీఎన్ శివకుమార్, జె. విష్ణువర్ధన్, ఎన్. జ్ఞానేశ్వర్‌రెడ్డి, స్టాండ్‌బైగా కె. దుర్గాప్రసాద్, కె. కార్తీక్ ఎంపికయ్యారు. బాలుర రిథమిక్ విభాగంలో సీహెచ్ దీపక్ నాయుడు, బాలుర ఆర్టిస్టిక్ విభాగంలో పి. షణ్ముఖ వికాస్ ఎంపికయ్యారు.

సంక్షిప్త వార్తలు

■ **నూజివీడు వెలుగు ఏసీగా సుందరరావు**

నూజివీడు: వెలుగు నూజివీడు ఏరియా కో-ఆర్డినేటర్(ఏసీ)గా డి. త్రిపుర సుందరరావు నియమితులయ్యారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఏసీ వైడీ విజయకుమారి ఏలూరులోని డీఆర్‌డీఏ కార్యాలయంలో డీపీఎంగా బదిలీ అయ్యారు. నూజివీడు ఏపీఎం దయాల రాజశేఖర్ ఆగిరిపల్లికి బదిలీ కాగా, ఆ స్థానంలోకి ఇంకా ఎవరూ నియమితులు కాలేదు. సీసీలు జీ దివ్య ఆగిరిపల్లికి, కె. రజని గన్నవరం మండలానికి బదిలీ కాగా, గన్నవరం మండలం నుంచి ఎ. నాగలక్ష్మి, మైలవరం నుంచి కె. ఎలీనా రాణి నూజివీడుకు బదిలీ అయ్యారు.

■ **బత్తులవారిగూడెంలో పల్లె నిద్ర**

నూజివీడు: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని నూజివీడు రూరల్ సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ అన్నారు. ఏలూరు ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి మండలంలోని బత్తులవారిగూడెంలో రూరల్ ఎస్ఐ లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో పల్లెనిద్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల నుంచి మెసేజ్ పంపుతున్నామని, ఆధార్ కార్డును అప్‌డేట్ చేయాలంటూ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని కోరుతూ నగదును కాజేస్తున్నారని, ప్రజలు ఎవరికి ఓటీపీ చెప్పొద్దని సూచించారు. ఇలాంటి మోసాలు జరిగినప్పుడు వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. రూరల్ ఎస్ఐ లక్ష్మణ్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

■ **నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీల నిర్వహణ**

నూజివీడు: పట్టణంలోని డీఏఆర్ కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలను జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ ప్రారంభించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

■ **ఆలయానికి విరాళం**

రోలుపడి(తిరువూరురూరల్): రోలుపడి శివారు గోకుల్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయానికి తిరువూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కాలసాని గోపాల నాగేశ్వరరావు రూ.50,116 విరాళం ఇచ్చారు. శనివారం ఆలయ నిర్మాణ కర్త రాచబంటి వెంకటాద్రి యాదవ్‌కు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ద్వారా ఈ విరాళాన్ని అందజేశారు.

■ **గర్భిణులకు సీమంతాలు**

తిరువూరు: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సమగ్ర పౌష్టికాహారం తీసుకుంటే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కమిషనర్ లోవరాజు, మెప్మా సీఓ ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆర్పీలు పాల్గొన్నారు.

■ **రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం**



మైలవరం: రెడ్డిగూడెం మండలంలోని కోతులవాగు వద్ద అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఏసీపీ ప్రసాదరావు పర్యవేక్షణలో స్వాధీనం చేసుకున్నామని సీఐ దాడి చంద్రశేఖర్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏసీపీ ప్రసాదరావు మాట్లాడుతూ డివిజన్‌లో ఏదైనా అసాంఘిక కార్యక్రమానికి సంబంధించిన పేకాట, కోడి పందేలు నిర్వహిస్తుంటే ఏసీపీ మైలవరం, 94409 06871, సీఐ 83329 83805 సెల్ నంబర్లకు తెలియజేయాలని కోరారు.

■ **సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి**

ఇబ్రహీంపట్నం: భవిత కేంద్రాల్లో సహిత ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దాలని రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్య కో-ఆర్డినేటర్ అన్నపూర్ణ అన్నారు. ఇబ్రహీంపట్నంలో భవిత కేంద్రాల సహిత ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యా బోధన త్వరలో డిజిటలైజేషన్ కాబోతుందన్నారు. ఈ నేపథ్యంలో దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లపై డిజిటల్ విద్య నేర్పడం ద్వారా వారిలో మానసిక వికాసం వృద్ధి చెందుతుందని చెప్పారు. భవిత కేంద్రాల్లో అవలంబించాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. సహిత విద్య జిల్లా కన్సల్టెంట్ ఉమామహేశ్వరరావు, కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఎంఈఓ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

■ **విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు**

కాచవరం(ఇబ్రహీంపట్నం): స్థానిక ఎంపీపీ పాఠశాల విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు కమ్యూనిటీ హెల్త్ అధికారి స్పందన శనివారం నిర్వహించారు. వయస్సుకు తగిన బరువు, ఎత్తు లోపాలను పరీక్షించి హిమోగ్లోబిన్ లోపం ఉన్న విద్యార్థులకు ఐరన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆకుకూరలు, మాసం, పాలు, గుడ్లు, తదితర ఆహార పదార్థాలు భోజనంలో ఉండేలా చూసుకోవాలన్నారు. హెచ్ఎం నాగమల్లేశ్వరి, హిందీ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

■ **ఎన్యూమరేషన్‌పై రైతుల ఆందోళన**

జి.కొండూరు: కవులూరు గ్రామంలో వరద ముంపునకు గురైన వరిపైరు నష్ట గణనలో అవకతవకలు జరిగాయంటూ రైతులు గత రెండు రోజులుగా ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు శనివారం కవులూరు గ్రామంలో ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ విచారణ బృందాలు సందర్శించి రీ ఎన్యూమరేషన్ చేసిన తర్వాత ప్రభుత్వానికి పూర్తి నివేదిక పంపుతామన్నారు.

■ **కార్మికులకు దుప్పట్ల పంపిణీ**

జి.కొండూరు: మండల పరిధి వెల్లటూరు గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ పంచాయతీ సిబ్బంది 50 మందికి గ్రామ నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పగడాల పెద్దసాంబయ్య దుప్పట్లను శనివారం పంపిణీ చేశారు. వరద సహాయక చర్యల్లో భాగంగా కార్మికులు చేసిన సేవలను కొనియాడుతూ దుప్పట్లను పంపిణీ చేశామని పెద్ద సాంబయ్య చెప్పారు.

■ **నోట్‌బుక్స్ వితరణ**

ఇబ్రహీంపట్నం: విజయశక్తి విద్యాలయం విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థులు నోట్‌బుక్స్, టెక్స్ బుక్స్‌ను శనివారం పంపిణీ చేశారు. హెచ్ఎం తులసి పిలుపు మేరకు ఆమె వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి విద్యార్థులకు బాసటగా నిలిచారు. విద్యార్థులు దాతల సహాయం సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదవాలని హెచ్ఎం కోరారు.